# 1

# పరిశుద్ధాత్మ ఎవరు?

*“నేను తండ్రిని వేడుకొందును, మీయొద్ద ఎల్లప్పుడు నుండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను, అనగా సత్యస్వరూపియగు* ***ఆత్మను*** *మీకనుగ్రహించును. లోకము ఆయనను చూడదు, ఆయనను ఎరుగదు గనుక ఆయనను పొందనేరదు; మీరు ఆయనను ఎరుగుదురు. ఆయన మీతో కూడ నివసించును, మీలో ఉండును, మిమ్మును అనాథలనుగా విడువను, మీ యొద్దకు వత్తును” (యోహాను 14:16–18).*

“పరిశుద్ధాత్మ ఏది?” అనేది ప్రశ్న కాదు, గాని, ప్రశ్న ఏమంటే, “పరిశుద్ధాత్మ ఎవరు?” ఎందుకంటె, పరిశుద్ధాత్మ ఒక జీవి, వ్యక్తిత్వముగల ఒక వ్యక్తి. ఆయన శక్తికంటెను అధికమైనవాడు; ఆయన సజీవుడైన పరలోకపు వ్యక్తి.

## ఆయన ఒక “ఆత్మ”

పాత నిబంధనలో *ruach* అనే హెబ్రీ పదం “ఆత్మ,” “వాయువు,” “ఊపిరి” గాను, “దేవుని ఆత్మ”గాను తర్జుమా చేయబడింది. క్రొత్త నిబంధనలో దానికి గ్రీకు సమము, *pneuma* అనేది మానవ ఆత్మను గాని (1 కొరింథీ. 2:11; సామెతలు 20:27 చూడు) లేదా దేవుడు (యోహాను 4:24) మరియు దేవదూతలను గాని (హెబ్రీ. 1:13, 14) సూచించడానికి వినియోగించబడింది. “ఆత్మ” అనే పదం కొన్నిసార్లు పరలోకపు జీవులకు, అంటే దేవుని సముఖమున నిలిచి ఆయనతో మాట్లాడిన ఆత్మను సూచించడానికి కూడ కొన్నిసార్లు ఉపయోగింపబడింది (1 రాజులు 22:21). “‘ఆత్మ’ అని తర్జుమా చేయబడిన *ruach* మరియు *pneuma* అనే రెండు పదాలకు అక్షరార్థం ‘వాయువు, ఊపిరి’ అని అర్థం. ప్రత్యేకించి దేవునికిని, మనుష్యునికిని, జీవించుచున్న జీవుల అదృశ్య వాస్తవాన్ని సూచించడానికిగాను ఈ రెండు పదాలు వాడుకలోనికి వచ్చాయి.”[1]

క్రొత నిబంధనలోని ప్రతి సందర్భంలోను, యోహాను 3:8 మినహాయించి, *pneuma* “ఆత్మ” అని తర్జుమా చేయబడింది. అక్కడ మాత్రం అనేక తర్జుమాలలో “వాయువు” అని కన్పిస్తుంది. అక్కడ కూడ “ఆత్మ” అనే దానినే కోరుకొనవచ్చు. ఈ వచనాన్ని గూర్చి James Oliver Buswell Jr. యిలా అన్నాడు: “కనీసం ఒక లేఖన భాగం (యోహాను 3:8) లోనైనా వ్యాఖ్యానం సందేహంగా ఉండవచ్చును గాని, ‘ఆత్మ తాను కోరుకున్న చోట ఊదును …’ అని ఈ వచనాన్ని తర్జుమా చేయవచ్చు.”[2]

Guy N. Woods యిలా రాశాడు,

> గ్రీకు కొత్త నిబంధనలో *pneuma* (Spirit ఆత్మ) అనే పదం కొన్ని వందలసార్లు వస్తుంది. ఏ యితర సంఘటనలో వాయువు అని ప్రామాణిక తర్జుమాలు తర్జుమా చేయలేదు. ఈ లేఖన భాగంలో అది రెండు సార్లు కన్పిస్తుంది మరియు మొదటి ప్రయోగంలో అది "వాయువు" అని, చివరి దానిలో "ఆత్మ" అని తర్జుమాచేయబడింది. "గాలి తన కిష్టమైన చోటను విసరును" అని తొలి ప్రయోగంలో ఎలా తర్జుమా చేయబడిందో 'గాలి మూలముగా' జన్మించిన ప్రతివాడును ఆలాగే యున్నాడని చివరి ప్రయోగాన్ని తర్జుమా చేసినా కూడ అంత తప్పు కాదు.[3]

ఆత్మ ఆయన మనలో ఉంచిన దేవుని స్వభావపు అంతరంగపు స్పార్క్ అయ్యుండవచ్చు (జెకర్యా 12:1; ప్రసంగి 12:7), మరణ సమయంలో అది దేహాన్ని వదిలిపోతుంది (ప్రసంగి 12:7; యాకోబు 2:26). అది యొక స్వభావము లేక తత్వమైయుండవచ్చు (రోమా 8:15; 1 కొరింథీ. 4:21; గలతీ. 6:1) లేక భౌతికము కాని జీవియై యుండవచ్చు (ఎఫెసీ. 2:2; 2 థెస్స. 2:2). ఆత్మయొక్క భౌతికేతర స్వభావాన్ని ప్రభువైన యేసు యిలా సూచించారు: "నేనే ఆయనను అనుటకు నా చేతులను నా పాదములను చూడుడి; నన్ను పట్టి చూడుడి, నాకున్నట్టుగా మీరు చూచుచున్న యెముకలును మాంసమును భూతమునకుండవు" (లూకా 24:39). ఆత్మయైయున్న దేవుడు (యోహాను 4:24), మానవ కన్నులకు అగోచరుడు (1 తిమోతి. 6:16). ఎందుకంటె, ఆత్మలు ఆత్మ సంబంధమైన పరిథిలో, భౌతికేతర పరిథిలో ఉనికి కలిగియుంటాయి (2 కొరింథీ. 4:18). మంచి ఆత్మలు దేవుని దూతలు (హెబ్రీ. 1:13, 14), అపవిత్రాత్మలు దయ్యములని (మార్కు 5:2, 15), అపవాది దూతలని పిలువబడ్డాయి (మత్తయి 25:41).

## ఆయన ఒక "వ్యక్తి"

బైబిల్లో లభించే వర్తమానమంతా పరిశుద్ధాత్మ ఒక వ్యక్తియనే వాస్తవాన్ని సూచిస్తుంది. తండ్రికిని కుమారునికిని ఏ లక్షణాలైతే ఉన్నాయో ఈయనకు కూడ అదే లక్షణాలున్నాయి.

### ఒక వ్యక్తియొక్క లక్షణాలు

కేవలం శక్తియే గాక పరిశుద్ధాత్మ యొక్క లక్షణాలన్నీ ఆయన ఒక సజీవమైన వ్యక్తియని సూచిస్తున్నాయి:

1. **తీర్మానము**: "పరిశుద్ధాత్మకును మాకును తోచెను" (అపో. 15:28ఎ).
2. **మనస్సు**: "హృదయములను పరిశోధించువాడు **ఆత్మ**యొక్క మనస్సు ఏదో యెరుగును" (రోమా 8:27ఎ).
3. **చిత్తము**: "అయినను వీటినన్నిటిని ఆ **ఆత్మ** యొకడే తన చిత్తము చొప్పున ప్రతివానికి ప్రత్యేకముగా పంచియిచ్చుచు కార్యసిద్ధి కలుగజేయుచున్నాడు" (1 కొరింథీ. 12:11). హెబ్రీ. 2:4 ప్రకారము పరిశుద్ధాత్మ వరములు దేవుని చిత్తానుసారముగా

యివ్వబడియున్నాయి.

4. **తెలిసికొను:** "ఆలాగే దేవుని సంగతులు దేవుని **ఆత్మకే** గాని మరి ఎవనికిని తెలియవు" (1 కొరింథీ. 2:11బి).

5. **ఉద్వేగములు:** (ప్రేమ, సంతోషము, దుఃఖపడుట): "సహోదరులారా ... మన ప్రభువైన యేసుక్రీస్తును బట్టియు, **ఆత్మ**వలని ప్రేమనుబట్టియు మిమ్మును బతిమాలు కొనుచున్నాను" (రోమా 15:30–32), "దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి; విమోచన దినమువరకు ఆయనయందు మీరు ముద్రింపబడియున్నారు" (ఎఫెసీ. 4:30); "పరిశుద్ధాత్మవలన కలుగు ఆనందముతో గొప్ప ఉపద్రవమందు మీరు వాక్యము నంగీకరించి, మమ్మును ప్రభువును పోలి నడుచుకొనినవారైతిరి" (1 థెస్స. 1:6).

ఈ లక్షణములన్నీ పరిశుద్ధాత్మ కలిగియున్నందున ఆయన ఒక వ్యక్తియని తెలియబడుచున్నది.

### వ్యక్తి యొక్క చర్యలు

పరిశుద్ధాత్మ కేవలం శక్తిగానే గాక ఒక వ్యక్తిగా కార్యములు జరిగిస్తాడు. ఆయన ఈ క్రింది కార్యములను చేయగలడు:

1. **బోధించి జ్ఞాపకముచేయుట:** "ఆదరణకర్త, అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" (యోహాను 14:26).

2. **సాక్ష్యమిచ్చును:** "తండ్రియొద్దనుండి మీ యొద్దకు నేను పంపబోవు ఆదరణకర్త, అనగా తండ్రి యొద్దనుండి బయలుదేరు సత్యస్వరూపియైన **ఆత్మ** వచ్చినప్పుడు ఆయన నన్నుగూర్చి సాక్ష్యమిచ్చును" (యోహాను 15:26).

3. **సత్యములోనికి నడిపించును:** "అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును" (యోహాను 16:13ఎ).

4. **మాట్లాడును:** "ఆయన తనంతట తానే యేమియు బోధింపక" (యోహాను 16:13బి; అపో. 8:29; 11:12; 1 తిమోతి 4:1లను కూడ చూడు).

5. **వినును:** "వేటిని వినునో వాటిని బోధించి" (యోహాను 16:13సి).

6. **తెలియజేయును:** "సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును" (యోహాను 16:13డి).

7. **ఆటంకపరచును:** "ఆసియలో వాక్యము చెప్పకూడదని పరిశుద్ధాత్మ వారాటంక పరచినందున, వారు ఫ్రుగియ గలతీయ ప్రదేశముల ద్వారా వెళ్లిరి" (అపో. 16:6).

8. **జీవింపజేయును:** "... మృతులలోనుండి క్రీస్తుయేసును లేపినవాడు చావునకు లోనైన మీ శరీరములను కూడ మీలో నివసించుచున్న తన **ఆత్మ**ద్వారా జీవింప జేయును" (రోమా 8:11బి).

9. **బయలుపరచును:** "మనకైతే దేవుడు వాటిని తన **ఆత్మ**వలన బయలు పరచియున్నాడు" (1 కొరింథీ. 2:10ఎ; ఎఫెసీ. 3:3–5ను కూడ చూడు).

10. **పరిశోధించును:** "ఆ **ఆత్మ** అన్నిటిని, దేవుని మర్మములను కూడ

పరిశోధించుచున్నాడు" (1 కొరింథీ. 2:10బి).

11. **వాగ్దానము:** "**ఆత్మ**ను గూర్చిన వాగ్దానము విశ్వాసమువలన మనకు లభించునట్లు, అబ్రాహాము పొందిన ఆశీర్వచనము క్రీస్తుయేసు ద్వారా అన్యజనులకు కలుగుటకై ..." (గలతీ. 3:14; అపో. 2:33 చూడు).

12. **సహవాసము:** "ప్రభువైన యేసుక్రీస్తు కృపయు దేవుని ప్రేమయు పరిశుద్ధాత్మ సహవాసమును మీకందరికిని తోడైయుండును గాక" (2 కొరింథీ. 13:14; ఫిలిప్పీ. 2:1 కూడ చూడు).

13. **విజ్ఞాపనము చేయును:** "ఉచ్చరింప శక్యముకాని మూలుగులతో ఆ **ఆత్మ** తానే మన పక్షముగా విజ్ఞాపనము చేయుచున్నాడు ... ఏలయనగా ఆయన దేవుని చిత్త ప్రకారము పరిశుద్ధులకొరకు విజ్ఞాపనము చేయుచున్నాడు" (రోమా 8:26, 27).

14. **సూచించి, భవిషత్ తెలుపును:** "తమయందున్న క్రీస్తు **ఆత్మ** క్రీస్తు విషయమైన శ్రమలనుగూర్చియు, వాటి తరువాత కలుగబోవు మహిమలను గూర్చియు ముందుగా సాక్ష్యమిచ్చునపుడు ..." (1 పేతురు 1:11).

15. **ఆహ్వానించును:** "**ఆత్మయు** పెండ్లి కుమార్తెయు రమ్ము అని చెప్పుచున్నారు" (ప్రకటన 22:17ఎ).

16. **నడిపించును:** "యేసు పరిశుద్ధాత్మ పూర్ణుడై యొర్దానునదినుండి తిరిగివచ్చి, నలువది దినములు **ఆత్మ**చేత అరణ్యములో నడిపింపబడి అపవాది చేత శోధింప బడుచుండెను" (లూకా 4:1); "దేవుని **ఆత్మ**చేత ఎందరు నడిపింపబడుదురో వారందరు దేవుని కుమారులైయుందురు" (రోమా 8:14).

ఈ కార్యకలాపాలలోని ప్రతి ఒక్కటిలోను ఒక వ్యక్తి మాత్రమే పాలుపొందగలడు గాని కేవలం శక్తియే వీటిని చేయలేవు. గనుక పరిశుద్ధాత్మను వ్యక్తిగానే చూడవలసి యుంటుంది.

### ఆయనను అవమానపరచవచ్చు

పరిశుద్ధాత్మను గాయపరచడానికిని, తేలికగా చూడడానికిని ఉపయోగించబడే పదముల వర్ణన ఒక వ్యక్తిని అవమానపరచడానికి ఉపయోగింపబడేవిగా కన్పిస్తాయేగాని, జీవములేని శక్తికి విరోధంగా ఉపయోగించబడేవిగా ఉండవు. పరిశుద్ధాత్మ ఈ క్రింది విధంగా అవమానపరచబడవచ్చు:

1. **దూషింపవచ్చు:** "**ఆత్మ** విషయమైన దూషణకు పాపక్షమాపణ లేదు. ... పరిశుద్ధాత్మకు విరోధముగా మాటలాడువానికి ఈ యుగమందైనను రాబోవు యుగమందైనను పాపక్షమాపణ లేదు" (మత్తయి 12:31, 32).

2. **అబద్ధమాడవచ్చు:** "పరిశుద్ధాత్మను మోసపుచ్చుటకు సాతాను ఎందుకు నీ హృదయమును ప్రేరేపించెను ...?" (అపో. 5:3ఎ) (lie to the Holy Spirit).

3. **ఎదిరించవచ్చు:** "మీరును ఎల్లప్పుడు పరిశుద్ధాత్మను ఎదిరించుచున్నార ..." (అపో. 7:51ఎ).

4. **దుఃఖపరచవచ్చు:** "దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి; విమోచన

దినమువరకు ఆయనయందు మీరు ముద్రింపబడియున్నారు" (ఎఫెసీ. 4:30).

5. **అవమానపరచవచ్చు లేక దుఃఖపరచవచ్చు:** "... కృపకు మూలమగు **ఆత్మను** (అవమానపరచు) తిరస్కరించినవాడు ..." (హెబ్రీ. 10:29).

6. **ఆర్పవచ్చు:** "ఆత్మను ఆర్పకుడి" (1 థెస్స. 5:19).

పరిశుద్ధాత్మను ఎలా అవమానపరచవచ్చునో సూచించే ప్రతిపాదనలు అయన వ్యక్తియనే వాస్తవాన్ని చాటుతున్నాయి. శక్తులను గాని అధికారాలను గాని అవమాన పరచడానికి పైన పేర్కొనబడిన విధానాన్ని – పద్యరూపములోనో లేక అలంకార రూపములోనో తప్ప – ఉపయోగించరు. పై వచనములలోని సందర్భాలు అలంకార భాషలో ప్రయోగింపబడినవి కావు.

**ఆయనకు ప్రత్యేకమైన ఉనికి ఉంది**

పరిశుద్ధాత్మ వ్యక్తి అనడానికి మరియొక సూచన ఏమంటే, తండ్రి, కుమారులతో పాటు వారి స్వభావము కలిగియున్నట్టు ఆయన ప్రస్తావించబడడం మాత్రమే గాక, ఆయనకు తనదైన ప్రత్యేకమైన ఉనికి ఉన్నట్టు కూడ తెలుపబడ్డాడు.

క్రీస్తు బాప్తిస్మం పొందినప్పుడు పరిశుద్ధాత్మ ఆయన మీదికి దిగివచ్చినట్టు ప్రస్తావించబడ్డాడు (యోహాను 1:33). బాప్తిస్మపు నీళ్లలోనుండి క్రీస్తు ఒడ్డునకు వచ్చుచుండగా, ఆత్మ ఆయన మీదికి దిగి వచ్చాడు, తండ్రి పరలోకంనుండి మాట్లాడాడు (మత్తయి 3:16, 17; లూకా 3:21, 22). తండ్రి పరలోకంలో ఉండిపోయాడు, కుమారుడు భూమిమీద నిలిచియున్నాడు; ఆత్మ క్రీస్తుతో నివసించడానికి దిగివచ్చాడు.

క్రీస్తుకు విరోధంగా ఒక వ్యక్తి మాట్లాడి క్షమించబడవచ్చు – కాని పరిశుద్ధాత్మకు వ్యతిరేకంగా ఒకడు మాట్లాడి, క్షమించబడడు (మత్తయి 12:32). యేసును, పరిశుద్ధాత్మయు ఒకే వ్యక్తియైతే యేసునకు వ్యతిరేకంగా మాట్లాడినవాడు పరిశుద్ధాత్మకు వ్యతిరేకంగా మాట్లాడకుండ ఎలా ఉంటాడు? ఈ బోధను యివ్వడంలో, వారు వేరైయున్న స్థితిని క్రీస్తు ఎరిగినవాడైయుండాలి.

పరిశుద్ధాత్మతో నిండుకొనినవారైయున్నట్టు ఎలాగు చెప్పబడ్డారో (అపొ. 6:3, 5; 7:55; 11:24), అలాగే క్రీస్తును పరిశుద్ధాత్మ పూర్ణుడైయున్నట్టు చెప్పబడ్డారు (లూకా 4:1). అపొస్తలుల కార్య గ్రంథంలో పరిశుద్ధాత్మ పూర్ణులైనవారందరు పరిశుద్ధాత్మ అనే వ్యక్తియే కారన్న వాస్తవాన్ని తప్పక అందరు అంగీకరిస్తారు. యేసును పరిశుద్ధాత్మయు కూడ వేరువేరుగా ప్రత్యేకమైన జీవులు అని గుర్తించవలసియుంటుంది.

యేసే పరిశుద్ధాత్మయని కొందరు నమ్ముతారు. కాని, యేసు మరియ గర్భాన జన్మించకముందే పరిశుద్ధాత్మ లోకంలో ఉన్నాడు. "అతడు యింకను తల్లి గర్భమందు ఉండగనే," పరిశుద్ధాత్మ యోహానుతో ఉన్నాడు (లూకా 1:15). మరియ పరిశుద్ధాత్మ ద్వారా గర్భవతి కాకయుండిన ఆరు నెలలకు ముందే ఆ సంఘటన జరిగింది (లూకా 1:26, 35 చూడు).

యేసు మహిమపరచబడలేదు గనుక (అపొస్తలులకు) పరిశుద్ధాత్మ యింకను యివ్వబడలేదని యోహాను రాశాడు (యోహాను 7:39). క్రీస్తు అపొస్తలులతో ఉన్నప్పుడే

ఈ సంగతి చెప్పబడింది. అప్పటికి పరిశుద్ధాత్మ యింకను యివ్వబడకుంటే, యేసు గాక పరిశుద్ధాత్మ తప్పక వేరొక వ్యక్తియైయుండి తీరాలి.

యోహాను 14:16 ప్రకారం, పరిశుద్ధాత్మయను (యోహాను 14:26), మరియొక లేక వేరొక "ఆదరణకర్త"ను యేసు తన అపొస్తలులకు పంపుతానని తెలిపాడు. ఆయనే ఆ ఆదరణకర్తయు సహాయకుడునైయుంటే "వేరొక" ఆదరణకర్తను లేక సహాయకుని ఎలా పంపుతానని యేసు అంటాడు? తానును యేసును ఒక్కటే అయ్యుంటే, పరిశుద్ధాత్మ "వేరొక" సహాయకుడు లేక ఆదరణకర్త ఎలాగైయుంటాడు?

Allon "వేరొక" అని తర్జుమా చేయబడిన గ్రీకు పదం – పరిశుద్ధాత్మ యేసు కాదని, ఆయనవంటి మరియొక వ్యక్తియనే భావన తెలుపబడింది. A. T. Robertson యిలా రాశాడు,

> వేరొక ఆదరణకర్త (*allon parakleton*). అదేరకమైన మరియొక (*allon*, *heteron* కాదు). మనకు సహాయకుడు, తండ్రితో విజ్ఞాపన చేయువాడునైన (1 యోహాను 2:1; cf. రోమా 8:26f.) యేసుగాక వేరొకాయన paraclete.[4]

*Allon* అనేది "సంఖ్య వ్యత్యాసాన్ని" వ్యక్తపరచుతుందని సూచిస్తూ Marvin R. Vincent రాశాడు.[5] తరువాత అతడు యిలా రాశాడు: "*allon* అనే పదమది, *eteron* కాదు, అంటే వ్యత్యాసమైనదని అర్థమిస్తుంది. పంపబడు ఆదరణకర్త క్రీస్తుకంటె వ్యత్యాసమైనవాడు కాడు, కాని ఆయనవంటివాడైన వేరొకడు."[6]

William Hendriksen యిలా రాశాడు: "వేరొక అనే పదం, నా పని చేయడానికి నా స్థలాన్ని తీసికొనే నావంటి మరియొకడు అని సూచిస్తుంది. అందును బట్టి, యేసు వ్యక్తియైయుంటే, పరిశుద్ధాత్మ కూడ వ్యక్తియే అయ్యుండాలి."[7] పరిశుద్ధాత్మ యేసు కాడు, ఆయన స్వభావంలో యేసుకు వేరుకాని, ఆయనవంటి మరియొక (ఆదరణకర్త) సహాయకుడు.

ఆయన వెళ్లితేనేగాని ఆదరణకర్తను, అంటే పరిశుద్ధాత్మను పంపనని ప్రభువైన యేసు తనవారికి తెలియజేశాడు (యోహాను 16:7). మరియు పరిశుద్ధాత్మ తనంతట తానే ఏమియు మాట్లాడక, వేటిని వినునో వాటినే తెలియజేయునని (ఆయన) క్రీస్తు తెలిపాడు (యోహాను 16:13, 14). యేసును గూర్చియు పరిశుద్ధాత్మను గూర్చియు క్రొత్తనిబంధన సమాచారము – వారిరువురు స్వతంత్రులైయున్న, వేరైన పరలోక సంబంధమైన వ్యక్తులైయున్నారని సూచిస్తుంది.

## ఆయన దైవం

తండ్రి కుమారులకు సమానముగాను, అదే అంతస్థుగలవాడైయున్నట్టును పరిశుద్ధాత్మ ప్రస్తావించబడ్డాడు. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ నామంలో ప్రజలు బాప్తిస్మం పొందవలసి యుంటుంది (మత్తయి 28:19) ఆత్మయైన దేవుడు ("తండ్రి"; 1 కొరింథీ. 8:6), ప్రభువు ("యేసు"; 1 కొరింథీ. 8:6) ఆత్మ సంబంధమైన వరములు ప్రసాదించువారు

గాను (1 కొరింథీ. 12:4-6), ఆత్మ యొక్క చిత్తం ప్రకారం జరిగించినట్టు కన్పిస్తుంది (1 కొరింథీ. 12:11). వారు ముగ్గురు ఒకే అంతస్థుగలవారైయున్నట్టు 2 కొరింథీ. 13:14లో పౌలు ప్రస్తావించాడు: "ప్రభువైన యేసుక్రీస్తు కృపయు దేవుని ప్రేమయు పరిశుద్ధాత్మ సహవాసమును మీకందరికిని తోడైయుండును గాక."[8]

తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ అనేవారు ఒకే స్వభావముగల వ్యక్తిగతంగా వేరైయున్న పరలోకపు (పరలోక సంబంధపు) వ్యక్తులైయున్నట్టు క్రొత్త నిబంధనలో ఎంతో ఎక్కువైన సాక్షాధారముంది. మానవుల పట్ల వారి పరిచర్యలోను, ఒకరితో ఒకరికున్న బాంధవ్యంలోను వారు ఏకముగా కలిసియున్నారు.

దేవునికి కలిగియున్న లక్షణములే పరిశుద్ధాత్మకు ఆరోపించబడ్డాయి. తండ్రితోను కుమారునితోను ఆయన పంచుకున్న అయిదు లక్షణాలను గమనించు:

1. **నిత్యత్వము**: నిత్యస్వభావానికి సంబంధించి బైబిల్లో ఈ క్రింది ప్రతిపాదనల్లో పరిశుద్ధాత్మను గూర్చి (1) "నిత్యుడగు **ఆత్మ** ద్వారా తన్నుతాను దేవునికి నిర్దోషినిగా అర్పించుకొనిన క్రీస్తుయొక్క రక్తము, నిర్జీవక్రియలను విడిచి జీవముగల దేవుని సేవించుటకు మీ మనస్సాక్షిని ఎంతో యెక్కువగా శుద్ధిచేయును" (హెబ్రీ. 9:14); (2) తండ్రిని గూర్చి – "పురాతన కాలమునుండి నీ సింహాసనము స్థిరమాయెను సదాకాలము ఉన్నవాడవు నీవే" (కీర్తన. 93:2); మరియు (3) క్రీస్తును గూర్చి "యేసుక్రీస్తు నిన్న, నేడు, ఒక్కటే రీతిగా ఉన్నాడు; అవును యుగయుగములకును ఒక్కటే రీతిగా ఉండును" (హెబ్రీ. 13:8). "ఆలాగున మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు యొక్క నిత్య రాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అనుగ్రహింపబడును" (2 పేతురు 1:11).

2. **సర్వజ్ఞత**: బైబిలు లేఖన భాగాలలో ఈ లక్షణము పలుకబడింది – (1) పరిశుద్ధాత్మను గూర్చి – "మనకైతే దేవుడు వాటిని తన **ఆత్మ**వలన బయలుపరచి యున్నాడు; ఆ **ఆత్మ** అన్నిటిని, దేవుని మర్మములను కూడ పరిశోధించుచున్నాడు" (1 కొరింథీ. 2:10); (2) తండ్రిని గూర్చి – "మరియు ఆయన దృష్టికి కనబడని సృష్టము ఏదియు లేదు. మనమెవనికి లెక్క యొప్పచెప్పవలసియున్నదో ఆ దేవుని కన్నులకు సమస్తమును మరుగులేక తేటగా ఉన్నది" (హెబ్రీ. 4:13); మరియు (3) క్రీస్తును గూర్చి "అయితే యేసు అందరిని ఎరిగినవాడు గనుక ఆయన తన్ను వారి వశము చేసికొనలేదు. ఆయన మనుష్యుని అంతర్యమును ఎరిగినవాడు గనుక ఎవడును మనుష్యుని గూర్చి ఆయనకు సాక్ష్యమియ్యనక్కరలేదు" (యోహాను 2:24, 25).

3. **సర్వ శక్తి**: బైబిలులోని పలు లేఖన భాగాలు ఈ స్వభావ లక్షణాన్ని (1) పరిశుద్ధాత్మకు సంబంధించి "పరిశుద్ధాత్మ నీమీదికి వచ్చును; సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ము కొనును ..." (లూకా 1:35బి); "అప్పుడు యేసు, **ఆత్మ** బలముతో గలిలయకు తిరిగివెళ్లెను" (లూకా 4:14ఎ); "అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు" (అపొ. 1:8ఎ); (2) దేవునికి సంబంధించి, "దేవుడు చెప్పిన యే మాటయైనను నిరర్థకము కానేరదు" (లూకా 1:37); యేసుకు సంబంధించి – "పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది" (మత్తయి 28:18).

4. **సర్వ స్థలములలో ఉండగల శక్తి.** ఈ గుణలక్షణము వర్తింపచేయబడింది – (1) పరిశుద్ధాత్మకు "నీ ఆత్మయొద్దనుండి నేనెక్కడికి పోవుదును?" (కీర్తన 139:7ఎ); (2) తండ్రికి – "నిశ్చయముగా దేవుడు ఈ లోకమందు నివాసము చేయడు; ఆకాశ మహాకాశములు సహితము నిన్ను పట్టజాలవు ..." (1 రాజులు 8:27ఎ); "నాకు కనబడకుండ రహస్య స్థలములలో దాగగలవాడెవడైన కలడా? నేను భూమ్యాకాశముల యందంతట నున్నవాడను కానా? ..." (యిర్మీయా 23:24); మరియు (3) యేసుకు "ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నాను ..." (మత్తయి 28:20బి).

5. **సృష్టింపగల శక్తి:** దేవత్వంలోని ప్రతి సభ్యుని బైబిలు లేఖనాలు సృష్టికర్తగా చిత్రించాయి. (1) పరిశుద్ధాత్మ – "చీకటి అగాధ జలము పైన కమ్మియుండెను; దేవుని ఆత్మ జలములపైన అల్లాడుచుండెను" (ఆది. 1:2)[9]; (2) తండ్రి – "ఆయన తన బలముచేత భూమిని సృష్టించెను తన జ్ఞానముచేత ప్రపంచమును స్థాపించెను, తన ప్రజ్ఞచేత ఆకాశమును విశాలపరచెను" (యిర్మీయా 51:15); మరియు (3) కుమారుడు "ఏలయనగా ఆకాశమందున్నవియు భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయనద్వారాను ఆయననుబట్టియు సృజింపబడెను ..." (కొలస్సీ. 1:16).

## ముగింపు

దేవునికే వర్తింపజేయు పదములతో పరిశుద్ధాత్మ వర్ణించబడ్డాడు. ఈ పద ప్రయోగాల వలన పరిశుద్ధాత్మ తండ్రితోను కుమారునితోను దైవ స్వభావంలో పాలుగలవాడనియు, తండ్రితోను కుమారునితోను ఒకడైయున్నాడనియు, అయితే వ్యక్తిగా ఆయన వేరైన వ్యక్తిత్వముగలవాడైయున్నాడనియు మనం తీర్మానం చేయవచ్చు. బైబిల్లో ఆయన ప్రాముఖ్యమైన కేంద్రమైన వ్యక్తియైయున్నాడు.

---

సూచనలు

[1]Emmet Russell, "Holy Spirit," *The New International Dictionary of the Bible,* eds. J. D. Douglas and Merrill C. Tenney (Grand Rapids, Mich.: Zondervan, 1987), 447. [2]James Oliver Buswell Jr., "Spirit," *The New International Dictionary of the Bible,* eds. J. D. Douglas and Merrill C. Tenney (Grand Rapids, Mich.: Zondervan, 1987), 961. [3]Guy N. Woods, *No on the Gospel According to John* (Nashville: Gospel Advocate Co., 1984), 63. [4]Archibald Thomas Robertson, *Word Pictures in the New Testament,* vol. 5 (New York: Harper & Brothers, 1932), 252. [5]Marvin R. Vincent, *Word Studies in the New Testament*, vol. 2 (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1946), 47. [6]Ibid., 244. [7]William Hendriksen, *Exposition of the Gospel According to John,* New Testament Commentary (Grand Rapids,

Mich.: Baker Book House, 1972), 275. [8]మత్తయి 3:16, 17; యోహాను 3:34; 14:26; 15:26; 16:15; రోమా 14:17, 18; 15:16; 1 కొరింథీ. 6:11; 2 కొరింథీ. 3:3; గలతీ. 4:6; ఎఫెసీ. 2:18, 20–22; 4:4–6; 5:18–20; 2 థెస్స. 2:13; హెబ్రీ. 9:14; 1 పేతురు 1:2; యూదా 20, 21లను చూడు. [9]సృష్టిలో పరిశుద్ధాత్మ సహాయపడినట్టు యితర లేఖన భాగాలు సూచిస్తాయి. అయినప్పటికి, స్థిరమైన రుజువు అవి చేసినట్టు కన్పించవు, యోబు 26:13 యొక్క అనేక తర్జుమాలు సృష్టికి వర్తింపజేసే ప్రతిపాదనకు వర్తింపజేయబడలేదు. యోబు 27:3; యెషయా 40:12, 13; కీర్తన. 33:6 విషయంలో కూడ అదే సత్యం. ఆత్మ సృష్టిలో సహాయపడినట్టు రుజువుగా కొన్ని సార్లు ఈ లేఖనాలు వినియోగించబడినట్టుంది, కీర్తన. 104:30 పద్య రూపంలో తిరిగి నూతనపరచే దాన్నిగూర్చి మాత్రమే సూచింపబడినట్టుంది, అసలు సృష్టిని గూర్చి కాదు.

---

## క్రైస్తవులలో పరిశుద్ధాత్మ పని

1. ఆయన పాప మరణముల నియమమునుండి మనలను విడిపించును (రోమా 8:2–8).
2. ఆయన మన పునరుత్థానమును తెచ్చును (రోమా 8:11).
3. ఆయన మన ప్రార్థనలలో సహాయము చేయును (రోమా 8:26; ఎఫెసీ. 6:18).
4. ఆయన మన పక్షముగా విజ్ఞాపనము చేయును (రోమా 8:26, 27).
5. ఆయన మనలను నడిపించును (రోమా 8:14).
6. ఆయన విమోచన దినమువరకు సంచకరువుగా ముద్రించబడును (2 కొరింథీ. 1:22; ఎఫెసీ. 1:13, 14; 4:30).
7. ఆయన మనతో సహవాసము చేయును (2 కొరింథీ. 13:14).
8. ఆయనయందు మనము తండ్రి సన్నిధికి చేరగలిగియున్నాము (ఎఫెసీ. 2:18).
9. ఆయన అంతరంగ పురుషుని బలపరచును (ఎఫెసీ. 3:16).
10. ఆయన ఐక్యతను తెచ్చును (ఎఫెసీ. 4:3).
11. ఆయన మనలను పరిశుద్ధపరచును (2 థెస్స. 2:13).